క్లుప్తంగా

వైఎస్సార్ బీమా అందజేత



చంద్రాల(మైలవరం): సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన పథకాలను లబ్ధిదారులు వినియోగించుకోవాలని వైఎస్సార్ రైతు విభాగం ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు జొన్నలగడ్డ గంగాధరరావు తెలిపారు. చంద్రాల గ్రామంలో సర్పంచ్ జ్యోతి ఆధ్వర్యంలో జొన్నలగడ్డ గంగాధరరావు ద్వారా వైఎస్సార్ బీమా పథకం కింద మంజూరైన రూ.లక్ష చెక్కును లబ్ధిదారులకు మంగళవారం అందజేశారు. గ్రామానికి చెందిన పరికెల ప్రసాద్ ఇటీవల మరణించాడు. మృతుడు ప్రసాద్ తమ్ముడు, నామినీ గోపయ్యకు చెక్కును అందజేశారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన



మైలవరం: గ్యాస్ సిలిండర్ల స్టాకును చెక్క స్లీపర్స్‌పై నిల్వ చేయాలని ఫైర్ ఆఫీసర్ సుబ్రహ్మణ్యేశ్వరరావు గ్యాస్ కంపెనీల యాజమాన్యాలకు సూచించారు. మైలవరంలో అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా ఐదో రోజు మంగళవారం స్థానిక సాయి మౌనిక భారత్ గ్యాస్ కంపెనీ గోడౌన్, కీర్తిరాయుని గూడెం సాయి గోవింద కృష్ణ ఫిల్లింగ్ స్టేషన్‌లో గ్యాస్, ఆయిల్ ద్వారా జరిగే అగ్ని ప్రమాదాలు, తీసుకోవాల్సిన జాగ్రతలపై సిబ్బంది, ప్రజలకు అవగాహన కల్పించారు. గ్యాస్ సిలిండర్ల నిల్వల మధ్యలో గ్యాంగ్‌వే, క్రాస్ సెక్షన్‌లు ఉంచాలన్నారు. వస్తువుల నిల్వలు 4.5 మీటర్ల ఎత్తుకంటే ఎక్కువ నిల్వ చేయొద్దన్నారు. తగినంత నీరు, ఇతర అగ్నిమాపక సాధనాలను సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. గాలి వెలుతురు వచ్చేలా చూడాలని ఫైర్ ఆఫీసర్ తెలిపారు. సిబ్బంది పాల్గొన్నారు.

నూజివీడు: పెట్రోలు బంకుల వద్ద, ఎల్పీజీ గోడౌన్ల వద్ద పనిచేసే సిబ్బంది అగ్నిప్రమాదాలు సంభవించకుండా నిరంతరం అప్రమత్తంగా ఉండాలని నూజివీడు అగ్నిమాపక కేంద్రం ఫైర్ ఆఫీసర్ కె.భాస్కరరామం అన్నారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా ఐదో రోజు మంగళవారం పట్టణంలోని పెట్రోలు బంకుల వద్ద, ఎల్పీజీ గోడౌన్ల వద్ద అగ్నిప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. దీనిపై కరపత్రాలు పంచారు. కార్యక్రమంలో ఫైర్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

దాతల సహకారం వినియోగించుకోండి



కొండపల్లి(ఇబ్రహీంపట్నం): దాతల సహకారాన్ని వినియోగించుకోవాలని మున్సిపల్ కమిషనర్ సీహెచ్ వెంకటేశ్వర్లు అన్నారు. ఇబ్రహీంపట్నానికి చెందిన అభ్యుదయ ఫౌండేషన్ కొండపల్లి పురపాలక సంఘం పారిశుద్ధ్య కార్మికులు, వీధి దీపాలు, తాగునీటి సరఫరా సిబ్బందికి సమకూర్చిన యాప్రాన్‌లు, హెల్మెట్లను కమిషనర్ వెంకటేశ్వర్లు మంగళవారం కార్మికులకు అందజేశారు. ఏఈ సాయి గణేష్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

శాస్త్రవేత్త ఐన్‌స్టీన్ వర్ధంతి



కొండపల్లి(ఇబ్రహీంపట్నం): భౌతిక శాస్త్రవేత్త ఆల్బర్ట్ ఐన్‌స్టీన్ వర్ధంతి మంగళవారం జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యాన కొండపల్లిలో జరిగింది. ఐన్‌స్టీన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. డాక్టర్ మామిడి సీతారామారావు మాట్లాడుతూ ప్రపంచంలో అత్యంత మేధావిగా ఐన్‌స్టీన్ పేరొందారన్నారు. జేవీవీ జిల్లా ఉపాధ్యక్షుడు పి.కామేశ్వరరావు, హెచ్ ఎం.శేషగిరిరావు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు ఉపయుక్తం వైఎస్సార్ యంత్ర సేవ

గంపలగూడెం: రైతాంగానికి ఉపయుక్తంగా వైఎస్సార్ యంత్ర సేవా పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తోందని మండల వ్యవసాయ అధికారి బి. సాయిశ్రీ, గంపలగూడెం కేడీసీసీ బ్యాంకు మేనేజర్ తెనాలి శ్రీనివాసరావు తెలిపారు. ఈ పథకం కింద 2022–23కు మండలంలోని 14 క్లస్టర్ హైరింగ్ గ్రూప్స్(సీహెచ్సీ)లకు మంజూరైన ట్రాక్టర్లు, యంత్ర పరికరాలను విడుదల చేసినట్లు మంగళవారం తెలిపారు. ఒక్కో సీహెచ్సీ గ్రూపునకు రూ. 15 లక్షల విలువైన ట్రాక్టర్, యంత్ర పరికరాలను అందజేశారు. ఒక్కో గ్రూపునకు అత్యధికంగా రూ. 6 లక్షల సబ్సిడీ అందజేస్తారని తెలిపారు. నెమలి, దుందిరాలపాడు, ఊటుకూరు–1, 2, ఆర్లపాడు, గొల్లపూడి, గంపలగూడెం–2, అనుముల్లంక, వినగడప, కొత్తపల్లి, పెద్దకొమిర, అమ్మిరెడ్డిగూడెం, చింతలనర్వ గ్రూపులకు యూనిట్లు విడుదలయ్యాయన్నారు. బ్యాంకు సూపర్‌వైజర్ ఏసోబు

వేగంగా కేడీసీసీ బ్యాంకు నిర్మాణం

- రూ.1.74 కోట్లతో నిర్మాణ పనులు
- రూ.83 లక్షలతో 15సెంట్ల స్థలం కొనుగోలు
- రైతులకు మెరుగైన సేవలందించడమే లక్ష్యం



గంపలగూడెంలో నిర్మిస్తున్న కేడీసీసీ బ్యాంక్ భవన సముదాయం

గంపలగూడెం: గంపలగూడెంలో కేడీసీసీ బ్యాంక్ శాఖ నూతన భవన సముదాయ నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఈ ప్రాంత రైతులకు అన్ని సౌకర్యాలు అందించాలన్న లక్ష్యంతో కేడీసీసీ బ్యాంక్ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు, తిరువూరు ఎమ్మెల్యే కొక్కిలిగడ్డ రక్షణనిధి చొరవతో బ్యాంక్‌కు రూ.2.57 కోట్లతో సొంత భవనాన్ని నిర్మిస్తున్నారు. ఉమ్మడి కృష్ణా జిల్లాలోనే రైతులకు విశిష్టమైన సేవలను అందిస్తున్న బ్యాంక్ శాఖగా ఈ బ్రాంచ్‌కు సొంత భవన సముదాయం నిర్మించాలన్న రెండు దశాబ్దాల కల నెరవేరబోతోంది. బ్యాంక్ నిర్మాణానికి అవసరమైన 15సెంట్ల స్థలాన్ని కుమ్మర బజారులో రూ.83 లక్షల బ్యాంక్ నిధులతో కొనుగోలు చేసి ఆ స్థలంలో నిర్మాణ పనులను వేగవంతంగా చేపట్టారు.

రూ.1.74 కోట్లతో భవన నిర్మాణం

గంపలగూడెం కేడీసీసీ బ్యాంక్ భవనానికి బ్యాంక్ పాలకవర్గం రూ.1.74 కోట్లు మంజూరు చేసింది. గతేడాది డిసెంబర్ 15వ తేదీన నిర్మాణ పనులు ప్రారంభిస్తూ బ్యాంక్ చైర్మన్, ఎమ్మెల్యేలు శంకుస్థాపన చేశారు. జనవరి నుంచి పనులను చేపట్టారు. ఒక అంతస్తు భవనం నిర్మిస్తున్నారు. ఇప్పటికే ఫౌండేషన్‌తో పాటు గ్రౌండ్‌ఫ్లోర్‌కు, మొదటి అంతస్తుకు శ్లాబ్ నిర్మాణమైంది. జూలై నాటికి పనులు పూర్తవుతాయని ఏఈ శ్రీనివాసరావు తెలిపారు.

నూతన భవనంలో వసతులు

నూతన భవన సముదాయలో గ్రౌండ్‌ఫ్లోర్‌లో బ్యాంక్ కార్యకలాపాలకు అవసరమైన వసతులతో హాలు, మేనేజర్ రూమ్, స్ట్రాంగ్‌రూం, జనరేటర్ రూం, రికార్డుల భద్రపరచే గది, మరుగుదొడ్ల నిర్మాణం, వాహనాల పార్కింగ్‌కు వసతుల పనులు జరుగుతున్నాయి. బ్యాంక్ భవనం ముందుభాగంలో ఏటీఎం రూం నిర్మిస్తారు. మొదటి అంతస్తులో సమావేశ మందిరం, సూపర్‌వైజర్స్, సొసైటీల సీఈఓలకు గది, పాత రికార్డుల భద్రపరచే గది నిర్మిస్తున్నారు.

కోర్టు భవన నిర్మాణానికి స్థలం కేటాయించాలి



మైలవరంలో మండల పరిషత్ కార్యాలయం ప్రాంగణంలో జూనియర్ సివిల్ జడ్జి కోర్టు

మైలవరం: మైలవరంలో సివిల్ జడ్జి కోర్టుకు స్థలం కేటాయించాలి. 2010 ఆగస్టులో ఈ కోర్టు ఏర్పాటు చేశారు. దీన్ని తాత్కాలికంగా స్థానిక మండల పరిషత్ కార్యాలయం భవనంపై ఏర్పాటు చేశారు. గతంలో మైలవరం నుంచి కక్షిదారులు తిరువూరు, నూజివీడులోని కోర్టులకు హాజరుకావల్సివచ్చేది. మైలవరంలో కోర్టు ఏర్పాటు చేయడంతో నియోజకవర్గంలోని నాలుగు మండలాలు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కేసులు, సివిల్ కేసులు ఇక్కడే పరిష్కరిస్తుండటంతో కక్షిదారులకు డబ్బు, సమయం కూడా ఆదా అవుతోంది. సుమారు రెండు వేల కేసులు వరకు ఇక్కడ కోర్టులో విచారణలు జరుగుతున్నాయి. జూనియర్ సివిల్ జడ్జి కోర్టు సొంత భవన నిర్మాణానికి అప్పట్లో స్థలం కోసం మైలవరంలోని ఎస్సీ బాలికల వసతి గృహం పక్కనే ఖాళీగా ఉన్న జిల్లా పరిషత్ స్థలం, ఎన్ఎస్పీ కార్యాలయం ప్రాంగణాన్ని జిల్లా జడ్జి రామచంద్రారెడ్డితో పాటు, జడ్జిలు చిరంజీవి, చంద్రశేఖర్ వచ్చి పరిశీలించారు. ప్రస్తుతం కోర్టు కొనసాగుతున్న ప్రాంగణంలో మండల విద్యా వనరుల కేంద్రం కార్యాలయం, మండల పరిషత్ కార్యాలయం, ఐకేపీ కార్యాలయంతో పాటు, ఎంపీపీ పాఠశాల కూడా కొనసాగుతుండటంతో కోర్టు కార్యకలాపాలకు తరచూ అంతరాయం ఏర్పడుతోంది. కోర్టు భవన నిర్మాణానికి స్థలం కేటాయిస్తే అందులోనే జడ్జి నివాసానికి, జైలు ఏర్పాటుకు కూడా అనుకూలంగా ఉంటుందని న్యాయవాదులు చెబుతున్నారు. కోర్టు భవన నిర్మాణానికి ఆర్ అండ్ బీ అధికారులు స్థలం కేటాయింపునకు అంగీకరించారు. జూనియర్ సివిల్ జడ్జి కోర్టు భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయడానికి ఉన్నతాధికారుల నుంచి అంచనాలు తీసుకుంటున్నారు. అయితే అడిషనల్ మున్సిఫ్ కోర్టు భవన నిర్మాణానికి కూడా నిధులు మంజూరు చేస్తే రెండు భవనాలు ఏక కాలంలో నిర్మించవచ్చని, రెండు కోర్టుల నిర్వహణకు ఇబ్బంది ఉండదని న్యాయవాదులు చెబుతున్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

గానుగపాడు(తిరువూరు): విద్యుత్ మెయిన్‌లైన్ల ఏర్పాటు నిమిత్తం మండలంలోని గానుగపాడు సబ్‌స్టేషన్ పరిధిలో బుధవారం ఉదయం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏపీఎస్పీడీసీఎల్ రూరల్ ఏఈ రాజ్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గానుగపాడు, చౌటపల్లి, చింతలపాడు, జికొత్తూరు తదితర గ్రామాల పరిధిలో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

నేడు పాతరావిచర్లలో గడప గడపకు మన ప్రభుత్వం

నూజివీడు: మండలంలోని పాతరావిచర్లలో బుధవారం సాయంత్రం 4 గంటల నుంచి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు నిర్వహిస్తారని ఎమ్మెల్యే కార్యాలయ వర్గాలు తెలిపాయి. ఎమ్మెల్యే ప్రతాప్, ఇతర అధికారులు పాల్గొంటారని పేర్కొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): విజయవాడలో ఈనెల 24న జరగనున్న జైభారత్ సత్యాగ్రహ బహిరంగ సభ పోస్టర్‌ను ఎన్టీఆర్ జిల్లా డీసీసీ అధ్యక్షుడు బొర్రా కిరణ్ కొండపల్లిలోని కార్యాలయంలో మంగళవారం ఆవిష్కరించారు. పీసీసీ కార్యదర్శి పోతురాజు ఏసుదాసు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల రక్తదానం

తిరువూరు: శ్రీవాహిని ఇంజినీరింగ్ కళాశాలలో మంగళవారం రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. నూజివీడు ఏరియా ఆస్పత్రి సహకారంతో కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఏర్పాటు చేసిన శిబిరాన్ని కళాశాల కమిటీ చైర్మన్ పసుమర్తి వెంకటేశ్వరరావు ప్రారంభించారు. రక్తదాన ఆవశ్యకతను ప్రిన్సిపాల్ నాగేంద్రబాబు, అధ్యాపకులు వివరించారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ కాశీ కృష్ణ తెలిపారు.

సొసైటీ సేవలు విస్తరింపజేద్దాం

మైలవరం: ఆర్ అండ్ బీ కో ఆపరేటివ్ సేవలు విస్తరింపజేద్దామని ప్యానల్ సభ్యుడు కె.జాన్సన్ తెలిపారు. మైలవరం ఆర్ అండ్ బీ డివిజన్ కార్యాలయంలో ఆర్ అండ్ బీ కో ఆపరేటివ్ సొసైటీ(రిజిస్టర్ నంబర్ 2385)కు జరిగే నూతన ప్యానల్ మద్దతు కోరుతూ జాన్సన్ మంగళవారం కార్యాలయం ప్రాంగణంలో సమావేశం నిర్వహించారు. గోపాలకృష్ణ, ప్రవీణ్‌కుమార్, అప్పారావు, నీర్సులు, మంగారావు తదితరులు పాల్గొన్నారు.

సూర్య నమస్కారాలతో సంపూర్ణ ఆరోగ్యం



ఇబ్రహీంపట్నం సీకాలనీ ఆడిటోరియంలో సూర్య నమస్కారాలు చేస్తున్న ఉద్యోగులు, స్థానికులు

ఇబ్రహీంపట్నం: సూర్య నమస్కారాలు చేస్తే సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చని యోగా గురువు లంకే జనార్ధన్ అన్నారు. వెంకటేశ్వర చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యాన సీ కాలనీ ఆడిటోరియంలో జరుగుతున్న యోగ శిక్షణ మంగళవారం ఆరో రోజుకు చేరింది. సూర్య నమస్కారాల సాధనతో శరీరం, మనసు బలపడతాయన్నారు. సాధకులకు యోగాసనాలు, సూర్యనమస్కారాలు, షట్ క్రియలు ఆచరించడం తెలియజేశారు. జలనేతి సూత్రాన్ని సూచించారు. ఎన్టీటీపీఎస్ ఎస్ఈలు సురేష్‌బాబు, మోహనవాసు దేవరావు, ఉద్యోగులు, సాధకులు పాల్గొన్నారు.

ముద్దరబోయిన చౌకబారు విమర్శలు తగవు

వైఎస్సార్ సీపీ ప్రజాప్రతినిధులు, నాయకుల ధ్వజం

నూజివీడు: ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉండటం, నియోజకవర్గ అభివృద్ధికి పడే తపన ప్రజలకు తెలుసని వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు పేర్కొన్నారు. ఎమ్మెల్యే స్థానిక కార్యాలయంలో మంగళవారం జెడ్పీ వైస్ చైర్మన్ గుడిమళ్ల కృష్ణంరాజు, మున్సిపల్ వైస్ చైర్మన్ పగడాల సత్యనారాయణ, కోఆప్షన్ సభ్యులు రామిశెట్టి మురళీకృష్ణ, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు శీలం రాము, క్రిస్టియన్ మైనారిటీ విభాగం ఏలూరు జిల్లా అధ్యక్షుడు పిళ్లా చరణ్, నాయకులు సయ్యద్ గబ్బర్‌లు విలేకర్లతో మాట్లాడారు. టీడీపీ ఇన్‌చార్జి ముద్దరబోయిన వెంకటేశ్వరరావు నూజివీడులో తన మనుగడ కోసం ఎమ్మెల్యే మేకా ప్రతాప్‌పై చౌకబారు విమర్శలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. ఇవి తగవని హితవు పలికారు. టీడీపీ హయాంలో ఒక్క అభివృద్ధన్నా చేశారా అని ప్రశ్నించారు. వైఎస్సార్ సీపీ పాలనలో రూ.21 కోట్లతో ఏరియా ఆస్పత్రిలో నూతన భవనాన్ని, రూ.1.60 కోట్లతో పట్టణంలో రెండు పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల భవనాలను, నాడు నేడులో రూ.25 కోట్లతో మండలంలోని ప్రభుత్వ పాఠశాలలను, రూ.33 కోట్లతో నూజివీడు – విజయవాడ ఆర్‌అండ్‌బీ రహదారి విస్తరణ పనులను చేశామని వివరించారు. నియోజకవర్గ వ్యాప్తంగా 10 వేల మందికి నివేశన స్థలాలను పంపిణీ చేయడంతోపాటు నూజివీడు, పట్టణం, మండలం కలిపి పేదలకు ఆరు వేల పక్కా గృహాలను వైఎస్సార్ సీపీ ప్రభుత్వం నిర్మిస్తోందని చెప్పారు. 300 ఎకరాల భూమి ఆక్రమించుకోవడం సాధ్యమవుతుందా, రోజుకు 300 లారీల ఇసుకను అక్రమంగా తోలడానికి ఇక్కడ అవకాశమే లేనప్పుడు ఎలా తోలతారని ప్రశ్నించారు. నియోజకవర్గంలో గోదావరి లేదా కృష్ణా నది ఉందా అని ఎద్దేవా చేశారు.

ముందు జాగ్రత్తే.. రక్ష



పరీక్షలు చేయించుకోవడానికి వచ్చిన ప్రజలు (ఫైల్)

నూజివీడు: కరోనా కొత్త వేరియంట్ బీఎఫ్–7 వ్యాప్తి చెందుతోన్న తరుణంలో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ప్రజలు ముందు జాగ్రత్తలు తీసుకోవడమే శ్రీరామ రక్షని వైద్యులు సూచిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు వైద్య ఆరోగ్యశాఖ అధికారులు ఇప్పటికే అప్రమత్తమై జ్వరం, దగ్గు, ఒళ్లు నొప్పులు, జలుబుతో ఎవరైనా ఆస్పత్రికి వస్తే వారికి వెంటనే కరోనా ర్యాపిడ్ టెస్ట్ చేస్తున్నారు. అవసరమైతే ట్రునాట్ టెస్ట్‌లు నిర్వహిస్తున్నారు. ఇటీవల నూజివీడు మండలం పడమర దిగవల్లిలో ముగ్గురికి, నూజివీడు పట్టణంలో ఇద్దరికి కరోనా పాజిటివ్ నమోదైంది. దీంతో వైద్య ఆరోగ్య శాఖ యంత్రాంగం అప్రమత్తమైంది.

మళ్లీ ఫీవర్ సర్వేలు

నాటి అనుభవంతో మళ్లీ ఫీవర్ సర్వే చేసేందుకు వైద్యశాఖ సన్నద్ధమవుతోంది. దేశంలో ఇప్పటి వరకు బీఎఫ్–7 వేరియంట్ కేసులు ఎక్కువగా నమోదు కాకున్నా ప్రజలు అప్రమత్తంగా ఉండాల్సిందేనని వైద్యులు సూచిస్తున్నారు. మాస్కు ధరించాలని, భౌతికదూరం పాటించాలని, చేతులను శానిటైజ్ చేసుకోవాలని చెబుతున్నారు.

జాగ్రత్తలు పాటించాలి

కరోన కొత్త వేరియంట్ కేసులు ఇతర రాష్ట్రాల్లో వస్తున్నందున ప్రజలు ముందు జాగ్రత్త చర్యలు పాటిస్తే మేలు. ఇతర దేశాలు, రాష్ట్రాల నుంచి రాకపోకలు సాగిస్తున్న వారితో అప్రమత్తంగా ఉండాలి. ప్రజలు మాస్క్ ధరించాలి. లక్షణాలు కనిపిస్తే పరీక్ష చేయించుకోవాలి.

– డాక్టర్ ఆర్ నరేంద్రసింగ్, ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్, నూజివీడు

22 నుంచి ఉచితంగా పుస్తకాల పంపిణీ

పటమట(విజయవాడతూర్పు): ప్రపంచ పుస్తక దినోత్సవం సందర్భంగా ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 22, 23 తేదీల్లో ఉచితంగా పుస్తకాల పంపిణీ చేస్తున్నామని సంఘం ప్రధాన కార్యదర్శి డాక్టర్ రావి శారద మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇందులో సాధారణ గ్రంథాలతో పాటు తత్వశాస్త్రం, మతాలు, ఆధ్యాత్మిక, సాంఘిక, భాష, ఇంజినీరింగ్, వైద్య విజ్ఞాన శాస్త్రాలతోపాటు కళలు, తెలుగు, ఆంగ్ల సాహిత్యం, చరిత్ర, బాల సాహిత్యం, వ్యక్తిత్వ వికాసం తదితర విషయాలకు చెందిన పుస్తకాలు అందుబాటులో ఉన్నాయన్నారు. తత్వశాస్త్ర గ్రంథాలు 2,200, మత, ఆధ్యాత్మిక గ్రంథాలు 7,400, సాంఘిక శాస్త్రాలు 3,300, శాస్త్ర సాంకేతిక రంగానికి చెందిన 5,000, ఆంగ్ల–తెలుగు సాహిత్యానికి చెందిన 5,800, చరిత్ర గ్రంథాలు 1,800, ఇంకా 8,000 పుస్తకాలకు పైగా ఇంజినీరింగ్, మెడికల్, మేనేజ్‌మెంట్, పోటీ పరీక్షలకు సంబంధించిన పుస్తకాలు అందిస్తామన్నారు. పదో తరగతి, ఇంటర్మీడియెట్, డిగ్రీ విద్యార్థులకు సంబంధించి వివిధ విద్యాసంస్థల స్టడీ మెటీరియల్ కూడా ఉన్నాయని చెప్పారు. ఆయా తేదీల్లో ప్రతి రోజూ ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు, మధ్యాహ్నం 3 నుంచి రాత్రి 7 గంటల వరకు బెంజిసర్కిల్ వద్ద ఉన్న సర్వోత్తమ గ్రంథాలయంలో పుస్తకాలు పంపిణీ చేస్తామన్నారు. విషయ ప్రాధాన్యత ప్రకారం పుస్తకాల ప్రదర్శన చేస్తున్నామని తెలిపారు. ఈ పుస్తకాల పంపిణీలో ఎవరైనా తమకు ఇష్టమైన రెండు పుస్తకాలను ఎంపిక చేసుకుని తీసుకెళ్లవచ్చన్నారు. ఈ అవకాశాన్ని ఉమ్మడి కృష్ణాజిల్లా వాసులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నవధాన్యాల సాగుతో భూసారం మెరుగు



హనుమాన్‌జంక్షన్ రూరల్: ఖరీఫ్ సీజన్‌కు ముందు నవధాన్యాలను సాగు చేయటం ద్వారా భూసారం పెరుగుతుందని, తద్వారా మొక్కలకు కావాల్సిన పోషకాలు అందుతాయని ప్రకృతి వ్యవసాయ విభాగం జిల్లా ప్రాజెక్టు మేనేజర్ కె.పార్థసారథి అన్నారు. బాపులపాడు రైతుభరోసా కేంద్రంలో నవ ధాన్యాల సాగుపై మంగళవారం రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఖరీఫ్‌లో ప్రధాన పంటను వేసే ముందుగా 32 రకాల నవధాన్యాలు పొలంలో చల్లుకుని 45 రోజులకు భూమిలో కలియదున్నటం వల్ల భూసారం పెరుగుతుందని వివరించారు. ఎంపీవో జొన్నలగడ్డ భవాని, జెడ్పీటీసీ సభ్యురాలు కొమరవల్లి గంగాభవాని, ఎంపీపీ యర్రగొర్ల నగేష్, సర్పంచ్ సరిపల్లి కమలాభాయి, ప్రకృతి వ్యవసాయ విభాగం జిల్లా అదనపు ప్రాజెక్టు మేనేజర్ నాగ మల్లేశ్వరి, వీఏఏ పూర్ణ, శారద, రాజేష్, వైఎస్సార్ సీపీ క్రిస్టియన్ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి కిరణ్‌మూర్తి, ఎంపీటీసీ సభ్యురాలు లక్ష్మీమాధవి తదితరులు పాల్గొన్నారు.

విస్సన్నపేటలో జగనన్నే మా భవిష్యత్తు



విస్సన్నపేటలో స్టిక్కరు అంటించి బ్రోచర్ అందజేస్తున్న ఎంపీపీ వనజాక్షి, ఇతర నేతలు

విస్సన్నపేట: జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమంలో భాగంగా విస్సన్నపేటలో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను వివరిస్తూ ప్రజాభిప్రాయం సేకరిస్తూ ఇంటి యజమాని అనుమతితో స్టిక్కర్లు అంటించారు. మంగళవారం విస్సన్నపేటలో పలు వీధుల్లో ఉత్సాహంగా జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం నిర్వహించారు. ఎంపీపీ పిల్లి మెర్సీ వనజాక్షి, సర్పంచ్ సాధుపాటి నాగమల్లీశ్వరి, గృహసారథుల మండల కన్వీనర్ అనుమోలు శివబాజీ, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు నెక్కళపు కుటుంబరావు, మండలయూత్ అధ్యక్షుడు హరి తదితరులు పాల్గొన్నారు.

నూజివీడు: నూజివీడు పట్టణం, మండలంలోని గ్రామాల్లో మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం ముమ్మరంగా సాగుతోంది. వైఎస్సార్‌సీపీ శ్రేణులు, ప్రజాప్రతినిధులు, గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు తమ పరిధిలోని గృహాలకు వెళ్లి రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తోన్న సంక్షేమ పథకాలను, వాటి కలిగిన లబ్ధిని ప్రజలకు వివరించారు.

ముసునూరు: మండలంలోని జెడ్పీటీసీ సభ్యుడు, సచివాలయాల కన్వీనర్ వరికూటి ప్రతాప్ ఆధ్వర్యంలో హుషరుగా జగనన్నే మాభవిష్యత్ కార్యక్రమం మంగళవారం సాయంత్రం నిర్వహించారు. కాట్రేనిపాడులో పార్టీ గ్రామ అధ్యక్షుడు కంబాల రాంబాబు ఆధ్వర్యంలో స్టేట్ హిస్టరీ అకాడమీ డైరెక్టర్ పి.స్వరూపరాణి, ముసునూరులో మండల యూత్ అధ్యక్షుడు గూట్రు రంగారావు, ఎంపీటీసీలు చీలి లక్ష్మీ అర్లప్ప, టి.కృష్ణకుమారి ఆధ్వర్యంలో, రమణక్కపేటలో సర్పంచ్ రంగు ధనలక్ష్మి గాంధీ ఆధ్వర్యంలో గడప గడపకు ప్రచారం చేశారు. కార్యక్రమాల్లో ఎంపీపీ ఆర్ కృష్ణకుమారి సుబ్బారావు, వైస్ ఎంపీపీ రాజానాయన పాల్గొన్నారు.

గోపవరంలో డ్రోన్ సర్వే



గోపవరంలో డ్రోన్ సర్వేను ప్రారంభిస్తున్న సర్పంచ్ వాణి తదితరులు

ముసునూరు: భూముల సమగ్ర రీసర్వే సమర్థంగా నిర్వహించడం అభినందనీయమని సర్పంచ్ కంచర్ల వాణి పేర్కొన్నారు. స్వామిత్వ సర్వే, భూ హక్కు – భూ పరిరక్షణ కార్యక్రమంలో భాగంగా అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో రూపొందిన డ్రోన్ కెమేరా రీసర్వే మండలంలో కొనసాగుతోంది. సర్వేయర్ సురేష్‌బాబు ఆధ్వర్యంలో నూజివీడు డీఐఓఎస్ వరహాలరాజు, రీసర్వే డీఐఓఎస్ షేక్ హుమాయూన్‌బేగ్ మంగళవారం గోపవరంలో సర్వే ప్రారంభించారు. నెలాఖరు వరకు మండలంలో రీ సర్వే జరుగుతుందన్నారు. కార్యక్రమాల్లో సొసైటీ అధ్యక్షుడు కోటగిరి గోపాలకృష్ణ, వైస్ ఎంపీపీ పాముల గంగాధర్, ఉప సర్పంచ్ పులిచర్ల లక్ష్మయ్య, పార్టీ గ్రామ అధ్యక్షుడు వల్లభనేని గోపాలకృష్ణ, రైతు పుల్లయ్య చౌదరి, పంచాయతీ కార్యదర్శి ఆరేపల్లి, వీఆర్ఓ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. ఇప్పటి వరకు కొర్లగుంట, తాళ్లపల్లి, కాట్రేనిపాడు, చిల్లబోయినపల్లి, వేల్పుచర్ల, బలివే గ్రామాల్లో సర్వే విజయవంతంగా పూర్తయిందని, గోపవరంలో కొనసాగుతోందని సర్వేయర్ సురేష్ తెలిపారు.

నవరత్నాలతో ఇంటింటా సంతోషం



సమావేశంలో మాట్లాడుతున్న దేశిరెడ్డి

చాట్రాయి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తోన్న నవరత్న పథకాలతో ప్రతి కుటుంబం అభివృద్ధి చెందుతోందని, ఆనందంగా ఉంటోందని రాష్ట్ర కో ఆపరేటివ్ యూనియన్ రాష్ట్ర చైర్మన్ దేశిరెడ్డి రాఘవరెడ్డి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఎంపీపీ లంకా నిర్మల అధ్యక్షతన మండల పరిషత్ సమావేశం నిర్వహించారు. అనంతరం నిర్వహించిన ఆయా శాఖల సమీక్షలో మండలంలోని 18 గ్రామ పంచాయతీల్లో 32 లే అవుట్లల్లో జల జీవన్ మిషన్ ద్వారా మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేస్తున్నామని, తాగు నీటి సమస్య ఉన్న గ్రామాల్లో అద్దె బోర్లతో నీటి సరఫరా చేపట్టనున్నామని ఆర్‌డబ్ల్యూ జేఈ సత్యప్రసాద్ తెలిపారు. 32 లే అవుట్లల్లో 1039 గృహాలు మంజూరయ్యాయని, సొంత స్థలాల్లో 1852 గృహాల మంజూరుకు ప్రతిపాదనలు పంపించామని హౌసింగ్ వర్క్‌ఇన్‌స్పెక్టర్ రవి వివరించారు. మిషన్ వాత్సల్య పథకంలో తల్లి లేదా తండ్రి లేదా మరణించిన పిల్లలకు నెలకు రూ.4 వేలు కేంద్ర ప్రభుత్వం ఇస్తుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ గాయత్రి చెప్పాగా, ఈ పథకం గురించి ప్రజాప్రతినిధులకు ఎందుకు తెలియజేయలేదని జెడ్పీటీసీ సభ్యురాలు చెలికాని అనూష ప్రశ్నించారు. సమావేశంలో వైస్ ఎంపీపీ పువ్వకాయల సుబ్బారెడ్డి, చల్లగుళ్ల జగన్‌మోహనరావు, పీహెచ్‌సీ వైద్యాధికారిణి లీనాబెంజిమెన్, మండల పరిషత్ సీనియర్ అసిస్టెంట్ సీతారామామావు, ఈవోఈఆర్‌డీ నాగరాజు, అధికారులు, ఎంపీటీసీలు సర్పంచ్‌లు పాల్గొన్నారు.

ఏబీఎం పాఠశాలకు రూ.లక్ష వితరణ



అమ్మిరెడ్డిగూడెం స్కూలుకు విరాళం ఇస్తున్న పూర్వ విద్యార్థులు

అమ్మిరెడ్డిగూడెం(గంపలగూడెం): అమ్మిరెడ్డిగూడెం ఏబీఎం హైస్కూల్లో ఉపాధ్యాయుల కొరత నేపథ్యంలో విద్యాబోధనకు అవసరమైన వలంటీర్ల నియామకానికి పూర్వ విద్యార్థులు కొందరు రూ. లక్ష విరాళం అందజేశారు. పూర్వ విద్యార్థి జి. రవికుమార్ తన అన్న జెరిమియా జ్ఞాపకార్థం రూ. 45వేలు, మందపాటి ఉమామహేశ్వరరెడ్డి, గిరిశాల వెంకట కృష్ణారావు, వేముల బాలయ్య, బజ్జూరి నరసింహారావు, గువ్వల సత్యనారాయణరెడ్డి ఒక్కొక్కరూ రూ. 10వేల చొప్పున, చిట్టిబొమ్మ వెంకటేశ్వరరావు రూ. 5వేలు విరాళంగా ఇచ్చినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు విజయకుమారి తెలిపారు. పూర్వ విద్యార్థులను ప్రధానోపాధ్యాయురాలు అభినందించారు.